క్లుప్తంగా

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శ



రఘురామయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం కేతిగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మోదేపల్లి రఘురామయ్య తల్లి రమణమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. రఘురామయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించనున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంత రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా తమ కళాశాలలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబరు 7780225869 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఈ–క్రాప్ నమోదు త్వరిత గతిన చేయించుకోండి

అల్లూరు: మండలంలోని రైతులు త్వరితగతిన సచివాలయ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద ఈ నెలాఖరులోగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాని ఇన్‌చార్జి ఏఓ వల్లేపు అశోక్ బుధవారం తెలియజేశారు. సాగు చేస్తున్న ప్రతి రైతు కచ్చితంగా చేసుకోవాలన్నారు. రైతుల పొలం, పాస్‌బుక్, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్‌ను సచివాలయ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద సమర్పించాలన్నారు.

ఆక్రమణల తొలగింపునకు సర్వం సిద్ధం

అనుమసముద్రంపేట: ప్రముఖ యాత్ర స్థలంగా విరాజిల్లుతున్న ఏఎస్‌పేట దర్గాకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఆక్రమణలను బుధవారం నుంచి తొలగించనున్నట్లు ఏఎస్‌పేట కార్యదర్శి యస్దాని బాషా తెలిపారు. లోకాయుక్త జడ్జి ఆదేశాల మేరకు మొదటి గేటు ఎదురు వీధి ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. గతంలో రెండు సార్లు ఆక్రమణల తొలగింపు నిర్ణయించామని, ఉన్నతాధికారులు, లోకాయుక్త కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపు చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. ఆక్రమణదారులు స్వచ్ఛందగా ఇచ్చిన గడువు లోపు తొలగించకపోవడంతో జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తొలగింపునకు సహకరించాలని కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం

వరికుంటపాడు: మండలంలోని విరువూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వి.శేషాద్రి, ఆర్.ఆదిశేషయ్య, కె.కుమారమ్మను బుధవారం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమాదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలింగ్ మినరల్ వాటర్ ఫ్రిజ్ బహూకరణ



పాఠశాలకు ఫ్రిజ్ అందజేత

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని కాటేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత జిలాని బుధవారం మినరల్ కూలింగ్ వాటర్ ఫ్రిజ్ అందజేశారు. దీంతో విద్యార్థులు శుభ్రమైన నీరు తాగే అవకాశం కలిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రజలకు సంపూర్ణ ప్రగతి ఫలాలు

- దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రణాళిక
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజల్లో ఆర్థిక అసమానతలు తొలిగించి, భావితరాలకు ఉన్నతమైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా నిర్దేశిత కార్యాచరణలతో అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణ ప్రగతి ఫలాలు అందిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కావలి పట్టణంలోని 18వ వార్డులో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించి బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాకాంక్ష ఉన్న ముఖ్యమంత్రికి ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ప్రజలు మురిసిపోయేలా పరిపాలన చేస్తారనే దానికి నిదర్శనం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. కరోనా వంటి విపత్తు వచ్చి రెండేళ్ల ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తే, రాష్ట్రంలో ప్రజలకు వివిధ పథకాల కింద నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేసి ఘనత దేశంలో ఒకే ఒక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు పేదలకు అత్యంత ముఖ్యమైన విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టి దేశ ప్రజలు అబ్బుర పడేలా అనూహ్యమైన ఆధునిక తలతో కూడిన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పోటీ పడి చేరడంతో కళకళలాడుతున్నాయని చెప్పారు. పేదలకు నాణ్యతతో కూడిన వైద్యం అందించడానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో నూతన భవనాలు నిర్మాణంతో పాటు వైద్యులు, సిబ్బంది నియామకాలు చేశారన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించ దానికి పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. చంద్రబాబు హయాంలో ఇవన్నీ చేసి ఉంటే ప్రజలే ఆదరించేవారన్నారు. ఎల్లో మీడియాలో ప్రచార ఆర్భాటాలు చేసుకుని ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు పరిపాలనకు నిదర్శనమన్నారు. జన్మభూమి కమిటీల దోపిడీ గాళ్లను చంద్రబాబు పెట్టి, ప్రజలకు నరకం చూపించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్లు ఏర్పాటు చేసి ప్రజలు ఇంటి వద్దకే ప్రభుత్వం వచ్చేలా చేశారన్నారు. ఎవరి సిఫార్సులు లేకుండానే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పాలన చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, షేక్ అబ్దుల్లా, మస్తాన్, చెన్ను ప్రసాద్‌రెడ్డి, కనుపర్తి రాజశేఖర్, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, షేక్ షాహలాల్ హమీద్, పెనుమల్లి అశోక్, కలికి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ద్వారానే ప్రజలకు సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడానికి వలంటీర్లతో సాధ్యమైందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రికీ రాని ఆలోచన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారని, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్లే అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడానికి వీలుపడిందన్నారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజలకు సంక్షేమ పథకాలు అందడమే కాక నిరుద్యోగం కొరత తీర్చిందన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థతో వారి మీద నమ్మకంతో ప్రతి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. దీంతో వలంటీర్ వ్యవస్థకు ప్రజల్లో విలువ పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తే రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మేలు చేకూరడమే కాక వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. సీఎం జగన్ పెట్టుకున్న నమ్మకాన్ని వలంటీర్లు సరైన పద్ధతిలో అమలు చేసి సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలను వివరించడంలో వలంటీర్ల పాత్ర ప్రధానమైందన్నారు. దుత్తలూరు మండలంలోని 11 సచివాలయాల ద్వారా ఇప్పటి వరకు కోట్లాది రూపాయల సంక్షేమ ఫలాలు పేదలకు అందించడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, సిమెంట్ రోడ్లు, తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతున్నప్పటికీ ప్రతిపక్షాలు, పచ్చమీడియా రాష్ట్రాభివృద్ధిపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. సీఎం జగన్ మాదిరిగా ఇంతవరకు ఎవరూ ఇలాంటి పాలన అందించలేదన్నారు. అందుకే 2024లో 175కు 175 సీట్లు గెలుస్తామనే ధీమాను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తపరుస్తున్నాడన్నారు. అందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. లబ్ధిదారులు సంక్షేమ పథకాలతో ఎంతో సంతోషంగా, సంతృప్తికరంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, జేఎస్సార్ ఫౌండేషన్ అధినేత దొంతిరెడ్డి జయసింహారెడ్డి, వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ శేషారెడ్డి, తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ సాయిప్రసాద్, నాయకులు సింగవరపు గంగాధరరెడ్డి, ఎల్‌పీ మాలకొండారెడ్డి, దేవరపాటి సురేంద్రరెడ్డి, చుండి చైతన్య, కంభం వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లతో సమీక్ష సమావేశం

సీతారామపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి మండలంలోని వలంటీర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

జలదంకి: మండలంలోని తొమ్మిదో మైలులో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ముగ్గురికి గాయాలైన ఘటన బుధవారం జరిగింది. తొమ్మిదో మైలుకు చెందిన గంగపట్నం మాలకొండయ్య, పరుసు మహేష్ మధ్య కొంత కాలంగా కలహాలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం ఇరువర్గాలు ఘర్షణ పడడంతో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. జలదంకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్


వరికుంటపాడు: మండలంలో నియమించిన బీఎల్వోలు బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ అన్నారు. ఆయన బుధవారం బీఎల్వోలతో సమీక్ష నిర్వహించారు. బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితా సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియలో వలంటీర్లను భాగస్వామ్యం చేయరాదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓటర్ల గుర్తింపు, చనిపోయిన వారి తొలగింపులు చేపట్టాలన్నారు. వందేళ్లు నిండిన వారిని గుర్తించాలన్నారు. ఒకే డోర్ నంబరులో పదుల సంఖ్యలో ఓట్లు ఉంటే క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలన్నారు.

వలంటీరు ఖాళీలకు ఇంటర్వ్యూలు



ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో 9 వలంటీర్ల ఖాళీలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు తెలిపారు. 20 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, 16 మంది హాజరయ్యారని వివరించారు. మున్సిపల్ ఆర్ఐ సయ్యద్ ఖాసీం, ఏఈ వరలక్ష్మి, మెప్మా సీఓ మాధవి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. సర్టిఫికెట్లను పరిశీలించి కుటుంబ సమాచారాన్ని సేకరించినట్లు, త్వరలో ఎంపికైన వారికి వ్యక్తిగత సమాచారం తెలియజేయనున్నట్లు కమిషనర్ వివరించారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



సంగం: మండలంలోని సిద్ధిపురంలో పోలేరమ్మ ఆలయంలో పోలేరమ్మ జాతర మహోత్సవం వైభవంగా జరుగుతోంది. జాతరలో భాగంగా అమ్మవారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మాట ఇస్తే నెరవేర్చే సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే నెరవేరుస్తారని, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులు 4,569 మందికి 23 శాతం జీతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలోని తన నివాసంలో ఉద్యోగులతో కలిసి బుధవారం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ ఇటీవల కావలి పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాము కలిసి పాదయాత్రలో తమకు జీతాలు 23 శాతం పెంచుతానని ఇచ్చిన హామీని గుర్తు చేయడానికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సహకరించారన్నారు. సీఎం జగన్ సున్నా వడ్డీ పథకం అమలు చేసే సందర్భంగా తమకు జీతాలు పెంచుతూ జీఓ విడుదల చేస్తానని చెప్పారన్నారు. ఆ మాట ప్రకారం వారం రోజుల క్రితం అమలాపురంలో సున్నా వడ్డీ నిధులు విడుదల చేసిన వేదికపైనే ఉద్యోగులైన తమకు 23 శాతం జీతాలు పెంచుతూ జీఓ కూడా విడుదల చేశారన్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తక్కువ జీతాలతో పేదలకు అనేక రకాలైన సేవలు అందించే పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగుల కష్టాన్ని సీఎం జగన్ గుర్తించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు ఏరియా ఓ ఆర్డినేటర్ జి. మధుసూదన్, ఏపీఎంలు టి.కాంతారావు, టి.ప్రసాద్‌రావు, కృష్ణవేణి, నాగమణి, సీసీలు రవికమార్, రసూల్, మోహన్, మాలకొండయ్య, కోటేశ్వరమ్మ, విజయమ్మ, రమణయ్య, చంద్రశేనయ్య, రాఘవులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, చెన్ను ప్రసాద్‌రెడ్డి, అమరా వేదగిరి, వేమిరెడ్డి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవు

- డీఎల్‌పీఓ రాధామాధవీలత



పారిశుధ్యం పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

ఉదయగిరి: పంచాయతీలో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేకపోతే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కావలి డీఎల్‌పీఓ కె.రాధామాధవీలత హెచ్చరించారు. ఆమె బుధవారం ఉదయగిరిలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దిలావర్‌బాయి వీధి, పంచాయతీ బస్టాండ్ సెంటర్, తదితర ప్రాంతాల్లో మురుగు ఉన్న ప్రాంతాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. దిలార్‌బాయి వీధికి సరఫరా అయ్యే తాగునీటిని పరిశీలించి నీటి పరీక్షలు చేస్తున్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య పరిస్థితులు మెరుగు పరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా పారిశుధ్య నిర్వహణ లోపంపై ఫిర్యాదులొస్తే సంబంధిత సిబ్బందిని బాధ్యుల్ని చేస్తామని చెప్పారు. రానున్న వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆమెతో పాటు ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నరసయ్య ఉన్నారు.

రూ.వెయ్యి కోట్లతో ఆత్మకూరు అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో పాటు ఆత్మకూరు నియోజకవర్గంలో వెయ్యి కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో బుధవారం ఆత్మకూరు నియోజకవర్గంలోని 93 సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురుమోహన్‌తో కలిసి అనంతరం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆత్మకూరు నియోజకవర్గం బహుముఖంగా అభివృద్ధి జరిగిందని, 2009లో ఆయన హఠార్మణం వల్ల పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయన్నారు. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి రెండేళ్లలోనే కరోనా మహమ్మారి వల్ల తలెత్తిన ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ అన్ని అవాంతరాలను దాటుకుంటూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ జగన్ ప్రభుత్వం సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు కులమత పార్టీలకు అతీతంగా అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు రూ.800 కోట్లు, అభివృద్ధి పనులు కోసం రూ.200 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత టీడీపీ ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు నియోజకవర్గానికి కనీసం రూ.150 కోట్ల అభివృద్ధి పనులు కూడా జరగని విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అఖండ మెజార్టీతో రెండో సారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సచివాయ కన్వీనర్లు, గృహ సారథులు మరింత పట్టుదలగా పనిచేయాలని కోరారు. ప్రజలకు అభివృద్ధి కార్యక్రమాలను వివరించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచేలా కృషి చేయాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురుమోహన్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడే తత్వం వైఎస్ కుటుంబానికి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత వారికి దక్కుతుందన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ నిధులతో ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సాదాబైనామా దరఖాస్తులపై ట్రైనీ కలెక్టర్ విచారణ



పెరమనలో విచారణ చేస్తున్న ట్రైనీ కలెక్టర్

సంగం: మండలంలోని పెరమనకు చెందిన కొందరు రైతులు సాదాబైనామాకు సంబంధించి దరఖాస్తు చేసుకోగా ట్రైనీ కలెక్టర్ సంజనా సింహా, తహసీల్దారు నాగరాజుతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వలంటీర్ల హాజరు సక్రమంగా ఉండడం లేదని, అటువంటి వారికి మెమోలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సంగం తహసీల్దారు కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. దరఖాస్తులు ఎలా దరఖాస్తు చేసుకోవాలన్న విషయంపై అవగాహన కల్పించారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లు వెంటనే కార్యాలయాలకు పంపించాలని, సచివాలయంలో రైతులకు సంబంధించిన దరఖాస్తులు దరఖాస్తు చేసే సమయంలో తప్పులకు అవకాశం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులను పక్కన పెట్టుకుని చేయాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

18లోగా సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరురూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులతో పాటు లబ్ధిదారులకు అందజేయాల్సిన ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 18లోగా పరిష్కరించాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని మహిమలూరు, రామస్వామిపల్లి సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. కార్యాలయాల్లోని సిబ్బంది హాజరుతో పాటు రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించి తప్పనిసరిగా బడికి పంపేలా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు భాస్కర్, కార్తీక్, వీఆర్‌ఓలు సూరిపోగు కృష్ణయ్య, రమణయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ అధికారులు

కావలి రూరల్: ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలపై అవగాహన కలిగి చెడు వ్యసనాలను దూరంగా ఉండాలని ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ తెలిపారు. పట్టణంలోని జవహర్ భారతి కళాశాలలో విద్యార్థులకు బుధవారం మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి యువత వెన్నెముక అని, ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ అఖిలేష్, కళాశాల ప్రిన్సిపల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని మేకపాటికి వినతి



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సాధన కమిటీ సభ్యులు

ఉదయగిరి: ఉదయగిరిని జిల్లా కేంద్రంగా మార్పు చేసేలా చూడాలని జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి దస్తగిరిఅహ్మద్ బుధవారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నివాస గృహంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉదయగిరి జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. ఉదయగిరి ప్రాంతం మూడు జిల్లాలకు కేంద్రంగా ఉందన్నారు. అత్యవసర వైద్యం కోసం వెళ్లాలంటే వంద కిలోమీటర్ల పైబడి ఉన్న ఒంగోలు, నెల్లూరు ప్రాంతాలకు అతికష్టం మీద వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉదయగిరిని జిల్లా చేస్తే ఈ ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ ఉపాధ్యక్షుడు గాజులపల్లి రామిరెడ్డి, కార్యదర్శి ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బట్టేపాడులో పురాతన విగ్రహానికి పూజలు



ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడులో తూమాటి ధనుంజయరెడ్డికి చెందిన పొలాల్లో బయటపడిన పురాతన మహంకాళీదేవి విగ్రహానికి బుధవారం స్థానిక ప్రజలు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమ నిర్వాహకులు తూమాటి విశ్వప్రసాద్‌రెడ్డి, వాసిపల్లి జితేంద్రరెడ్డి మాట్లాడుతూ పొలాల్లో అమ్మవారి విగ్రహం ఉన్న విషయం ఇటీవల గ్రామానికి చెందిన ఒకరికి కలలో వచ్చి అమ్మ వారు చెప్పినట్టుగా పేర్కొన్నారు. ఈ విషయమై కాశీనాయన భక్తులను సంప్రదించి వారి సూచనలకు అనుగుణంగా విగ్రహం లభించిన చోటే కొంచెంపైకెత్తి అదే స్థలంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశామన్నారు. తాత్కాలికంగా పందిళ్లు వేసి నీడ కల్పించామని, త్వరలోనే దాతల సహకారంతో అక్కడ దేవాలయం నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

అన్నదమ్ముల మధ్య గొడవ

అనుమసముద్రంపేట: ఆస్తి పంపకాల విషయంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవ జరగడంతో అన్న తమ్ముడిపై దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని పెద్దబ్బీపురంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన ఉసా యానాదయ్యకు ఇద్దరు కుమారులు ప్రసాద్, వెంకటేశ్వర్లు. ఇంటి పంపకాల విషయంలో వీరిద్దరి మధ్య బుధవారం గొడవ జరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ప్రసాద్ గాయపడడంతో పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న ఎస్సై నరేష్ గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించి క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు.